# ఆధార్ అప్‌డేట్‌కు తిప్పలు



ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో ఉదయం ఆధార్ నమోదు కోసం క్యూలైన్‌లో ప్రజలు



ఆధార్ సెంటర్‌లో రద్దీగా ఉన్న ప్రజలు

- మీసేవ కేంద్రాల వద్ద ప్రజల పడిగాపులు
- సిబ్బందిని పెంచాలని ప్రజల వేడుకోలు

**జ్యోతినగర్:** రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. కానీ దీనికి ఆధార్ అప్‌డేట్ మాత్రం ప్రస్తుతం ప్రజలకు అవరోధంగా మారింది. కాంగ్రెస్ సర్కార్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల లబ్ధి పొందేందుకు ఆధార్ అప్‌డేట్ కచ్చితంగా కావాలనే నిబంధనలతో ఆధార్ సెంటర్ల వద్ద ప్రజలు తిప్పలు పడుతున్నారు. వేకువజామునుంచే ఆధార్ సెంటర్ల వద్ద క్యూలో పడిగాపులు కాస్తున్నారు.

**ఆధార్ సర్వీస్ సెంటర్ల వద్ద క్యూలైన్..**

రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతోంది. ప్రజల నుంచి స్పందన వస్తోంది. గత పాలక ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడం, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ప్రవేశపెట్టడంతో ప్రతి దరఖాస్తు సెంటర్ వద్ద జనజాతర కనిపిస్తోంది. గతంలో సమగ్ర కుటుంబ సర్వే జరిగిన సమయాల్లో జనాలు తాము ఉండే వివిధ ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు తరలివచ్చిన రీతిగా నేడు ప్రజాపాలనకు ప్రజలు తరలివెళ్తున్నారు.

**ఆధార్‌సెంటర్ల వద్ద రద్దీ..**

ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులకు దరఖాస్తులు అందించే వరకు ప్రజలకు ఆధార్ కార్డు ప్రాధాన్యం ఏంటో పూర్తిస్థాయిలో అర్థం కాలేదు. కానీ ప్రస్తుతం ప్రజాపాలన సెంటర్ల నుంచి ఆధార్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. ప్రజాపాలన సెంటర్ల వద్ద కంటే ఎక్కువగా ఆధార్ సెంటర్లు జనాలతో కిక్కిరిసిపోతున్నాయి.

**ఆధార్ కార్డుల్లో లేని రాష్ట్రం..**

ప్రజలు రాష్ట్ర ఆవిర్భావానికి ముందు తీసుకున్న ఆధార్ కార్డులో ఆంధ్రప్రదేశ్‌గా ముద్రితమై ఉంది. కొంతమంది మాత్రమే అప్‌డేట్ చేసుకున్నారు. చాలా మంది ఇంకా అప్‌డేట్ చేసుకోలేదు. బ్యాంకు ఖాతాలు తెరిచేటప్పుడు, రుణాలు తీసుకునే సమయాల్లో మామూలుగా ఆంధ్రప్రదేశ్ స్థానంలో తెలంగాణ పేరు మార్చుకోవాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా ఆధార్ కార్డులను ప్రజలు బయటకు తీశారు. ప్రజాపాలన సెంటర్లలో దరఖాస్తులు తీసుకోడానికి ఇబ్బంది పడేవారి పరిస్థితిని జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు.

**సిబ్బందిని పెంచాలని వేడుకోలు..**

ఆధార్ కేంద్రంలో సిబ్బందిని పెంచితే ప్రజలు ఎక్కువ సమయం వేచి ఉండే అవరం ఉండదని, సిబ్బంది తక్కువగా ఉండటంతో వేచి ఉండాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత విభాగం అధికారులు ప్రభుత్వ ఆధీనంలో కొనసాగే మీసేవా కేంద్రాల్లో సిబ్బందిని పెంచాలని కోరుతున్నారు.

## ఆరు గ్యారంటీల అమలుకే ప్రాధాన్యం



ఎలిగేడు: సుల్తాన్‌పూర్ ప్రజాపాలన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

**పెద్దపల్లిరూరల్:** కాంగ్రెస్ ప్రజలకిచ్చిన ఆరుగ్యారంటీలను అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం మూలసాల, పెద్దపల్లి మున్సిపల్‌లోని రంగంపల్లిలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. డీసీవో శ్రీమాల, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మధుసూదన్ శర్మ, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్, కమిషనర్ వెంకటేశ్, సర్పంచ్ శంకరయ్య పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ ఫలాలు**

**ఎలిగేడు:** అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని సుల్తాన్‌పూర్ పంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలన దఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు అమలు చేసేందుకు చిత్తశుద్ధితో ఉన్నామన్నారు.

**ఎమ్మెల్యేకు సన్మానం..**

మొదటిసారిగా ఎమ్మెల్యే సుల్తాన్‌పూర్ గ్రామానికి రావడంతో సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు సన్మానించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి తిరుపతిరావు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

**పేదల సంక్షేమానికే ప్రజాపాలన గ్రామసభలు**

**కాల్వశ్రీరాంపూర్:** పేదల సంక్షేమం కోసమే ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తున్నామని, ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు కోరారు. ప్రజాపాలన గ్రామసభల్లో పాల్గొనేందుకు శుక్రవారం మండలంలోని కూనారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు సర్పంచ్ డొంకెన విజయ, ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామస్తులు, మహిళలు స్వాగతం పలికారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో తక్కువ నీళ్లు ఉన్నాయని, అయినా నియోజకవర్గ రైతాంగం కోసం అధికారులతో మాట్లాడి ఆయకట్టు చివరి ప్రాంతం వరకు సాగునీరు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ జాహెద్ పాషా, ఎంపీడీవో రామ్మోహన్‌రావు, ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ కొల్లూరి రమాదేవి, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, అధికారులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వం**

**సుల్తానాబాద్‌రూరల్:** కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం లబ్దిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గర్రెపల్లి, నారాయణపూర్, కందునూరిపల్లెలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, స్వరూప, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రెండోరోజు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



కమాన్‌పూర్: పరిశీలిస్తున్న పెద్దపల్లి డీసీపీ చేతన



సుల్తానాబాద్: దరఖాస్తు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్



ఫెర్టిలైజర్‌సిటీ: 14వ డివిజన్ లక్ష్మీపురంలో..

**పాలకుర్తి:** ప్రజాపాలన సభలు శుక్రవారం మండలంలోని నాలుగు గ్రామాల్లో నిర్వహించారు. మంథని నియోజకవర్గ పరిధిలోని బామ్లానాయక్‌తండాతో పాటు రామగుండం నియోజకవర్గ పరిధిలోని బసంత్‌నగర్, పుట్నూర్, జయ్యారం గ్రామాల్లో తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీవో లలిత ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. నాలుగు గ్రామాల్లో మొత్తం 1939 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. మండల ప్రత్యేకాధికారి శివయ్య, రవిశంకర్ పరిశీలించారు. ఎంపీవో షబ్బీర్‌పాషా, ఆర్ఐ.భానుకుమార్ పాల్గొన్నారు.

**ముత్తారం:** మండలంలోని ఖమ్మంపల్లిలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. గ్రామంలో 915 దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా మార్కెట్ అధికారి, మండల స్పెషల్ అధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాస్, ఎంపీడీవో కలికోట శ్రీనివాస్, ఎంపీవో బైరి వేణుమాధవ్, కార్యదర్శి సాగర్‌రావు, సర్పంచి సముద్రాల రమేశ్, ఎంపీటీసీ అల్లం తిరుపతి పాల్గొన్నారు.

**ఫెర్టిలైజర్‌సిటీ:** రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం ప్రభుత్వ పాఠశాలలో సభ ఏర్పాటు చేశారు. డిప్యూటీ కమిషనర్ మనికేశ్వరరావు దరఖాస్తులను స్వీకరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ బందోబస్తు నిర్వహించారు.

**కమాన్‌పూర్:** మండలంలోని పేరపల్లి, గొల్లపల్లెలో ప్రభుత్వం నిర్వహించి ప్రజాపాలన గ్రామసభలను శుక్రవారం మంథని ఆర్డీవో హనుమనాయక్, పెద్దపల్లి డీసీపీ చేతన సందర్శించారు. పేరపల్లిలో ప్రజల నుంచి ఆర్డీవో దరఖాస్తులు స్వీకరించారు. గొల్లపల్లెలో పెద్దపల్లి డీసీపీ చేతన ఏర్పాట్లను పరిశీలించారు. పేరపల్లిలో 319, గొల్లపల్లెలో 205 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్, తహసీల్దార్ మోహన్‌రెడ్డి తెలిపారు.

**జూలపల్లి:** మండల పరిధిలోని చీమలపేట, కాచాపూర్ గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులను ప్రత్యేక కౌంటర్ల ద్వారా అధికారులు స్వీకరించారు.

**సుల్తానాబాద్:** పట్టణంలోని వైశ్య భవనం, వివేకానంద హైస్కూల్లో 15, 4వ వార్డుల్లో దరఖాస్తులు స్వీకరించారు. మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, వైస్ చైర్మన్ బిరుదు సమత, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.



పాలకుర్తి: దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ జ్యోతి

**ఓదెల:** మండలంలోని గోపరపల్లె, గుండ్లపల్లె, గూడెం గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు జరిగాయి. మండల స్పెషల్ అధికారి జగన్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో సత్తయ్య పాల్గొన్నారు.

## బల్దియాలో భారీగా దరఖాస్తులు



గోదావరిఖని రాంనగర్ వార్డు సభలో..



వార్డుసభను పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

**కోల్‌సిటీ:** రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో రెండోరోజు 8డివిజన్లలో ప్రజాపాలన వార్డుసభలు నిర్వహించారు. దరఖాస్తు చేసుకోవడానికి వార్డుసభలకు భారీగా జనం తరలివచ్చారు. శుక్రవారం ఉదయం 9, 10, 11, 12వ డివిజన్లలో, మధ్యాహ్నం 13, 14, 15, 16వ డివిజన్లలో వార్డుసభలు నిర్వహించారు. వార్డుసభల్లో మేయర్ బంగి అనిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, తహసీల్దార్ కుమారస్వామి, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. స్థానిక 11వ డివిజన్‌లో నిర్వహించిన వార్డుసభను గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు పరిశీలించారు. వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు పాల్గొన్నారు.

**12వేలకుపైగా వచ్చిన దరఖాస్తులు..**

నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న ప్రజాపాలన వార్డుసభల్లో శుక్రవారం సాయంత్రం వరకు ప్రజల నుంచి 12,721 దరఖాస్తులు స్వీకరించారు. గురువారం ఒక్కరోజే 6,990 దరఖాస్తులు రాగా, రెండోరోజు శుక్రవారం 5,731 వరకు దరఖాస్తులు వచ్చాయి. శనివారం ఉదయం 17, 18, 19, 20వ డివిజన్లలో, మధ్యాహ్నం 21, 22, 23, 24వ డివిజన్లలో ప్రజాపాలన వార్డుసభలు నిర్వహించనున్నారు.

## ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ పరిశీలన



రామగుండం: కుందనపల్లిలో..



రామగుండం: పొట్యాలలో డీపీఓ చంద్రమౌళి

**రామగుండం:** అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఉన్నతాధికారులు సందర్శించారు. ఇందులో భాగంగా ప్రజాపాలన కార్యక్రమ నియోజకవర్గ ప్రత్యేకాధికారి, పీఆర్ ఈఈ గిరీష్‌బాబు, టీం లీడర్ సురేశ్ దరఖాస్తుల స్వీకరణ సరళిని పరిశీలించారు. పొట్యాల గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి సందర్శించారు. గ్రామాల్లో జరిగిన ప్రజాపాలనలో దరఖాస్తులు సమర్పించేందుకు ప్రజలు బారులు తీరారు. అధికారులతో ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో మోతె సమ్మిరెడ్డి, అంతర్గాం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ ఆముల నారాయణ ఉన్నారు.

## సింగిల్‌విండో చైర్మన్‌పై అవిశ్వాసం ప్రతిపాదన



డీసీవోకు తీర్మానం అందిస్తున్న డైరెక్టర్లు

**పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లి మండలం అప్పన్నపేట ప్రాథమిక సహకార సంఘ చైర్మన్ దాసరి చంద్రారెడ్డిపై అవిశ్వాసాన్ని ప్రతిపాదిస్తూ సంఘ వైస్‌చైర్మన్ చింతపండు సంపత్ సహా పది మంది డైరెక్టర్లు అవిశ్వాసాన్ని ప్రతిపాదించారు. ఈ మేరకు అవిశ్వాస తీర్మాణాన్ని శుక్రవారం జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాలకు అందించారు. అవిశ్వాస తీర్మానంపై వైస్‌చైర్మన్ చింతపండు సంపత్‌తో పాటు డైరెక్టర్లు ఆరె తిరుపతి, గండు వెంకటేశం, మల్లయ్య, చంద్రయ్య, యెల్లెంకి స్వామి, గోపాల్, తాడిచెట్టి సదయ్య, కొత్త వెంకటమ్మ, లోకిని శారద సంతకాలు చేసి డీసీవోకు తీర్మానం అందించారు.

## గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తు స్వీకరిస్తున్న ఆర్డీవో హనుమానాయక్

**రామగిరి:** ప్రజా సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో హనుమానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాగెపల్లి గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలు దరఖాస్తులు అందించాలని సూచించారు. అధికారులు నిర్ణీత సమాయానికి ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలకు వచ్చి దరఖాస్తులు స్వీకరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సర్పంచ్ కొండవేన ఓదెలు యాదవ్, ఎంపీపీ ఆరెల్లి దేవక్క, ఎంపీడీవో రమేశ్, నాయబ్ తహసీల్దార్ రాకేశ్‌రెడ్డి, ఏపీఎం స్వరూపరాణి, ఎంపీటీసీ తీగల స్వప్న పాల్గొన్నారు.

## గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలే లక్ష్యం



నీరుకుల్ల పర్యటనలో కేంద్ర బృందం సభ్యులు



వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం

**సుల్తానాబాద్‌రూరల్:** గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా కేంద్రం పని చేస్తుందని కేంద్ర బృందం టీం, కేంద్ర హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ సుశీల్ విమల్, టీవీఎస్ రంజిత్‌బాబు అన్నారు. సుల్తానాబాద్ మండలం నీరుకుల్లలో మన సంకల్పం వికసిత భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. డాక్టర్ దివ్య, ఎన్‌సీడీపీవోలు సుధాకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, సర్పంచ్ విజేందర్‌గౌడ్ ఉన్నారు.

**కుక్కలగూడుర్‌లో కేంద్రబృందం పర్యటన**

**పాలకుర్తి:** మండలంలోని కుక్కలగూడుర్ గ్రామంలో శుక్రవారం వీక్షిత్ భారత్ సంకల్ప్‌యాత్రలో భాగంగా కేంద్రబృందం సభ్యులు పర్యటించారు. డాక్టర్ సుశీల్ విమల్, డాక్టర్ దివ్యాణి, టీవీఎస్ రంజిత్‌బాబుతో కూడిన బృందం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వైద్యసేవల విషయమై స్థానికంగా పరిశీలించారు. ఆరోగ్య భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ ఆరోగ్య పథకాల అమలు గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పుట్నూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా టీబీ అధికారి సుధాకర్‌రెడ్డి, ఎన్‌సీడీపీవో అధికారి మధుకర్‌రెడ్డి, పుట్నూర్ పీహెచ్‌సీ మెడికల్ అధికారి సాయిసూర్య, సర్పంచ్ గోంద్ర చందర్, సూపర్‌వైజర్ సంతోష్, హెడ్‌నర్సు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ ఆఫీసులో క్యాలెండర్ ఆవిష్కరణ**

**పెద్దపల్లిరూరల్:** జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ ఆవిష్కరించారు. నాయకులు చిలారపు పర్వతాలు, దాడి సంతోష్, సురేశ్, సంపత్‌రావు, రాజ్‌గోపాల్, వేల్పుల సత్యం, శ్రీకాంత్, రమేశ్, సతీశ్, మధు, వినయ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

**నేత్రదానం చేసిన లారీ క్లీనర్**

**కోల్‌సిటీ:** గోదావరిఖనిలో రాగుల రాజు(39) అనే లారీ క్లీనర్ నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. స్థానిక చంద్రబాబుకాలనీకి చెందిన రాజు అనారోగ్య సమస్యలతో గురువారం మృతి చెందాడు. నేత్రదానం గురించి గోదావరిఖని జీజీహెచ్ ఆసుపత్రిలోని ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంక్ టెక్నీషియన్ బాలు అవగాహన కల్పించగా కుటుంబ సభ్యులు స్పందించారు. నేత్రాలను హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు తరలించారు.

## ఎస్సారెస్పీ కాలువల మరమ్మతుపై దృష్టి



కాలువను పరిశీలిస్తున్న అధికారులు

**కాల్వశ్రీరాంపూర్:** శ్రీరాంసాగర్ డి–86, డి–83 కాలువలు, వాటి ఉప కాలువలు కొన్ని ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న వాటికి మరమ్మతు చేపట్టాలని కాల్వశ్రీరాంపూర్, వెన్నంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట, ఇదులాపూర్ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే విజయరమణారావుకు శుక్రవారం రైతులు విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే కాలువల పరిస్థితిని పరిశీలించాలిందిగా సంబంధితశాఖ అధికారులు, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్‌ను ఆదేశించారు. సారయ్యగౌడ్ ఆయా ప్రాంతాల్లో శిథిలమైన కాలువల విషయమై ఎమ్మెల్యేకు వివరించారు. శిథిలమైన కాలువలను మరమ్మతు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధ చేసి ఆయకట్టు రైతులకు రబీ పంటలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్సారెస్పీ అధికారులు సంపత్, సురేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మండల పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కలీమొద్దీన్, నాయకులు అల్లంల రాజన్న, అరికటి సదయ్య పాల్గొన్నారు.

## సీనియర్ సెక్యూరిటీ అధికారికి సన్మానం



సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

**రామగిరి:** ఈ నెల 23న జరిగిన సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైన ఆర్జీ–3 సీనియర్ సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణను శుక్రవారం సెంటినరీకాలనీ లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఎన్నో సేవా కార్యక్రమాల్లో తమకు తోడుగా ఉంటూ ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైనందుకు హర్షం వ్యక్తం చేస్తూ సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్, గంట వెంకటరమణారెడ్డి, డా.శరణ్య, కొంక పోచయ్య, గడ్డం శ్రావణ్, బాబురావు, అశోక్‌కుమార్, సంపత్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అన్నదానం, రథయాత్ర నిర్వహణకు విరాళం



చెక్కు అందజేస్తున్న దాత రాజనర్సయ్య

**రామగుండం:** పట్టణంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయ సముదాయంలోని అయ్యప్ప ఆలయంలో ప్రతీ ఏటా జనవరి ఒకటిన మహా అన్నదానం, అదే రోజు మణికంఠుడి రథయాత్ర నిర్వహిస్తారు. కాగా శుక్రవారం సదరు కార్యక్రమ నిర్వహణకు పట్టణానికి చెందిన భక్తుడు ఇరికిళ్ల రాజనర్సయ్య రూ.50వేల చెక్కును ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖర శర్మ, గురుస్వామి గోపగాని రాములుగౌడ్ ఉన్నారు.

### ప్రభుత్వ కాలేజ్‌లో ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో పాల్గొన్న విద్యార్థినులు

**పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో శుక్రవారం ఎన్టీపీసీకి చెందిన వైద్యులు విద్యార్థులకు ఉచితంగా రక్త, దంత పరీక్షలు నిర్వహించారు. ఇతర ఆరోగ్య సమస్యలు గుర్తించి పరిష్కారానికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నరహరి, అధ్యాపకులు ప్రసూన, శ్రీలత, సంతోష్‌రెడ్డి, అశోక్, రామకృష్ణ, స్వరూప, కుమారస్వామి పాల్గొన్నారు.

### వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న నంబూద్రి స్వామి

**మంథని:** పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజ, అగ్నిగుండాల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కేరళకు చెందిన సంజీవ్ నంబూద్రిస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌తోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ శంకర్

**మంథని:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలోని ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని ఎంపీపీ కొండ శంకర్ అన్నారు. మండలంలోని రచ్చపల్లి, గుమ్మునూర్, మైదుపల్లి, గాజులపల్లి గ్రామాల్లో రెండోరోజు కొనసాగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి దరఖాస్తు స్వీకరించాలని ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఆర్డీవో హనుమానాయక్ ఆయా గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. తహసీల్దార్ రాజయ్య, ఎంపీవో ఆరీఫ్, ఏవో శ్రీకాంత్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనగామ నర్సింగరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

**జ్యోతినగర్:** ఎన్టీపీసీ రెడ్డి సంక్షేమ సంఘం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని జరిగిన కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు మందల బక్కారెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాఘవరెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ విజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కూర మహేశ్వరెడ్డి, కార్పొరేటర్ ఎన్వీ రమణారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొలని కవితారెడ్డి పాల్గొని కొత్త సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కొలని రమ, సందిటి మాధవి, కోర్ కమిటీ సభ్యులు, కార్యవర్గ సభ్యులతో పాటు రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.